చదువుతో విజ్ఞానం, సంస్కారం



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న రవీంద్రనాథ్‌బాబు

పెనమలూరు: విద్యార్థులు చదువుకుంటే విజ్ఞానంతో పాటు సంస్కారం కూడా వస్తుందని మంగళగిరి డీజీపీ కార్యాలయం ఐపీఎస్ అధికారి ఎం.రవీంద్రనాథ్‌బాబు అన్నారు. కానూరు సిద్ధార్థ ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాల 33వ వార్షికోత్సవంలో ఆయన శనివారం రాత్రి పాల్గొన్నారు. రవీంద్రనాథ్‌బాబు మాట్లాడుతూ పిల్లల లక్ష్యం ఏమిటో తల్లితండ్రులు తెలుసుకోవాలని వారికి ఏరంగంలో ఆసక్తి ఉందో అందులో ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, పాఠశాల కన్వీనర్ వీరపనేని శశికళ, సిద్ధార్థ అకాడమీ సంయుక్త కార్యదర్శి నిమ్మగడ్డ లలితప్రసాద్, పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి కాకాని తరుణ్, ప్రిన్సిపాల్ మనోజ్‌కర్మాకర్ తదితరులు పాల్గొన్నారు.

మైనేని జీవితం అందరికీ ఆదర్శం



మైనేని జయప్రద చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నారాయణ

పెనమలూరు: కంకిపాడు నియోజకవర్గానికి రెండుసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై ప్రజలకు ఉత్తమ సేవలు అందించిన మైనేని లక్ష్మణస్వామి జీవితం అందరికీ ఆదర్శమని సీపీఐ జాతీయ కార్యదర్శి కే.నారాయణ అన్నారు. ఇటీవల మరణించిన విద్యావేత్త, లక్ష్మణస్వామి సతీమణి మైనేని జయప్రద సంస్మరణ సభ కానూరు ఆహ్వానం కల్యాణ మండపంలో ఆదివారం జరిగింది. నారాయణ మాట్లాడుతూ జయప్రద జిల్లాలో ఉత్తమ సైన్స్ అధ్యాపకురాలిగా బాధ్యతలు నిర్వహించి ఎందరో విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, మహిళా సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు అక్కినేని వనజ, నేతలు నాగేశ్వరరావు, వెంకటేశ్వరరావు, అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

కానూరులో వృద్ధుడు అదృశ్యం

పెనమలూరు: కానూరులో వృద్ధుడు అదృశ్యం అవ్వడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టి.రామారావు తెలిపిన వివరాల ప్రకారం కానూరు సనత్‌నగర్ రామాలయం వీధిలో కర్రి పద్మావతి భర్త వేణుగోపాలరావు(60)తో ఉంటుంది. భర్త కార్పెంటర్ పనులు చేస్తాడు. కాగా అక్టోబర్ నెలలో భర్త ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అతనికి బయట పనులు ఉంటే పనికి వెళ్లి 15 రోజుల వరకు తిరిగిరాడు. దీంతో భర్త పని ముగించుకుని ఇంటికి వస్తాడని భార్య పద్మావతి అనుకుంది. అయితే భర్త రాకపోవడంతో అతనికి ఫోన్ చేస్తే స్విచ్చాఫ్ వస్తుంది. దీంతో పద్మావతి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

ఇస్త్రీ బండి అందజేత



ఇస్త్రీ బండి అందజేస్తున్న జయప్రకాష్

రామవరప్పాడు: స్వయం ఉపాధి కోసం వైఎస్ఆర్ చారిటీస్ ట్రస్ట్ చైర్మన్ యలమంచలి జయప్రకాష్ ఆదివారం ఎనికేపాడులో ఇస్త్రీ బండి అందజేశారు. గ్రామంలో నివాసం ఉంటున్న అప్పారావు, కల్పన దంపతులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులు తెలుసుకుని ఇస్త్రీ బండి అందజేశారు. జయప్రకాష్ మాట్లాడుతూ పలు నియోజకవర్గాల్లో వైఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యలమంచలి సామ్రాజ్యం, వెల్లంకి రాజా, మధు, బొప్పన శ్రీనివాస్, యలమంచలి భీముడు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంగానమ్మ జాతర



గంగానమ్మకు సమర్పిస్తున్న ఘటం కుండలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడులో శ్రీ గంగానమ్మ అమ్మవారి జాతరను ఆదివారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో ఎంపీటీసీ సభ్యుడు రాచమళ్ల శ్రీనివాసరావు, రత్నకుమారి దంపతుల పర్యవేక్షణలో గంగానమ్మకు ఘటం కుండలతో చద్దియ్యాపారం(సద్దన్నం) నిర్వహించారు. ఘటం కుండలతో గ్రామంలో పర్యటించి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమాలల్లో రజక సంఘం అధ్యక్షుడు రాచమళ్ల అంజయ్య, వెంకటేశ్వరరావు, రాచమళ్ల రామకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

ప్రకటన

ఎన్‌టిఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలం, అంబాపురం గ్రామ పంచాయతీ అంబాపురం గ్రామ రీ సర్వే నెం. 35/3 దాఖలా ఈ దిగువ షెడ్యూలు ఆస్తి 469-67 చ.గ. ఖాళీ నివేశన స్థలమునకు హక్కుదారులైన గండికోట గురవయ్య మరియు గండికోట చిట్టిబాబు గార్లకు చెందిన ఆస్తిని నా క్లయింటున్నూ, విజయవాడ వాస్తవ్యులయిన ఎస్. రామారావు గారు క్రయం పొందుటకు ఒప్పందము కుదుర్చుకుని విక్రయ అడ్వాన్సు చెల్లించి వారల నుండి విక్రయ అగ్రిమెంటును పొందియున్నారు. యీ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై చెల్లదగిన బాకీలు గానీ, కోర్టు జప్తులు గానీ, యింజక్షన్లు ఉత్తర్వులు గానీ, ఏ విధమైన కోర్టు లిటిగేషన్లు గానీ, క్లయిములు గానీ, అభ్యంతరములు గానీ వున్నయెడల ఈ దిగువ తెలిపిన నా క్లయింటు చిరునామాకు లిఖితపూర్వకముగా రిజిష్టరు పోస్టు విత్ ఎక్‌నాలెడ్జ్‌మెంట్ ద్వారా పది రోజుల లోపుగా తెలియజేయగలరు. దరిమిలా నా క్లయింటు పై తెలిపిన వారలకు బాలెన్సు క్రయ ప్రతిఫలమును చెల్లించి వారల నుండి నా క్లయింటు పేరునగానీ, వారి అర్డరు పొందిన వారి పేరుతో గానీ సక్రమమైన రిజిస్టరు విక్రయ దస్తావేజును పొందగలరనియు, దరిమిలా వచ్చే ఎట్టి క్లయిములు, అభ్యంతరములు నా క్లయింటును ఎంత మాత్రము బైండు చేయజాలవని అందరికి యిందుమూలముగా తెలియచేయడమైనది. షెడ్యూలు: నున్న సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా విజయవాడ రూరల్ మండలం, అంబాపురం గ్రామ రీ సర్వే నెం.35/3 దాఖలా ప్లాట్ నెం.1 దాఖలా ఆస్తికి హద్దులు: తూర్పు: ప్లాటు నెం.37 దాఖలా ఆస్తి అ.53-0లు, దక్షిణం: ఆర్. ఎస్.నెం. 34/4 దాఖలా ఆస్తి అ.82-00లు, పడమర: కిలారు నిర్మల గారి వగైరాల ఆస్తి, అ.50-10లు, ఉత్తరం: అ.33-0లు వెడల్పు గల రోడ్డు అ.82-0లు. ఈ నాలుగు హద్దుల మధ్య చ.గ. 469-67 ఖాళీ నివేశన స్థలము మరియు యావత్తు యీజ్‌మెంట్ హక్కులతో సహా.

నా క్లయింటు చిరునామా:
ఎస్. రామారావు
డి.నెం.11-63-6, బ్రాహ్మణ వీధి,
విజయవాడ-1

ఎం.డి.ఎస్. నాగేశ్వర గుప్త
అడ్వకేట్
ఎం.ఎస్. వీధి,
హనుమాన్‌పేట, విజయవాడ

3 నుంచి పెన్షన్ల పంపిణీ

విజయవాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జనవరి 3వ తేదీ నుంచి మండలంలోని గ్రామాల్లో లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌ను రూ. 2750 నుంచి మూడు వేల రూపాయలకు పెంచిదన్నారు. మండలంలో కొత్తగా 230 మందికి కొత్త పెన్షన్లు మంజూరైనట్టు తెలియజేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం

అజిత్‌సింగ్‌నగర్: విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సింగ్‌నగర్‌లో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం... సింగ్‌నగర్ వడ్డెరకాలనీకి చెందిన గుంజా శివకుమార్ ఇంట్లో ఆదివారం తెల్లవారుజామున వంటగదిలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వైఎస్సార్ సీపీ నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి బాధితులను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు.

ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండాలి



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముదిరాజ్‌లు సంఘటితంగా ఉండి హక్కుల కోసం పోరాడటానికి కలిసి రావాలని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ కోర్ల నారాయణ ముదిరాజ్ పిలుపునిచ్చారు. 20 లక్షలు పైగా ఉన్న ముదిరాజులను చైతన్యపరిచి రాజకీయ హక్కుల కోసం పోరాడేందుకు ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ ప్రచార చైతన్య రథం ప్రారంభించి కళా జాతాలు నిర్వహిస్తుంది.. డిసెంబర్ 22వ తేదీన ప్రకాశం జిల్లా ఒంగోలులో ప్రారంభమైన ప్రచార చైతన్య రథం ప్రకాశం, గుంటూరు జిల్లాలు మీదుగా ఆదివారం మధురానగర్‌కు చేరుకుంది. ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు వర్ణ నారాయణ ముదిరాజ్ ప్రధాన కార్యదర్శి వలిబోయిన రాజు ముదిరాజ్ ఆధ్వర్యాన చైతన్య రథం మధురానగర్‌లో కొనసాగింది. ప్రజా కళాకారుడు బుల్లెట్ వెంకన్న ముదిరాజ్ ఆధ్వర్యంలో కళాకారులు ప్రజాగేయాలతో చైతన్య పరిచారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలో ముదిరాజ్‌లను రాజకీయంగా చైతన్యపరిచేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వలిబోయినరాజు ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి దుప్పలశివాజీ ముదిరాజ్ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు చింతకాయల శివాజీగణేష్ ఉపాధ్యక్షుడు కోలా ఏడుకొండలు తోకల రవి, బుస్సా రామకృష్ణ , శంకర్ సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్

మహిళ సహా తొమ్మిది మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

తెనాలిరూరల్: భర్త హత్యకు దారి తీసిన దంపతుల గొడవ ఘటనపై కేసు నమోదవగా, తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కొత్తపేటలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ బి.జనార్ధనరావు వివరాలు తెలిపారు. కఠెవరం గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన మృతుడు గేరా వాసు పెయింట్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గ్రామానికి చెందిన బత్తుల అబ్రహాం కూతురు వెన్నలను నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వాసు తల్లి అనారోగ్యానికి గురవడంతో ఆమెకు సంబంధించిన పనులన్నీ వెన్నలే చేస్తోంది. ఈ క్రమంలో 25వ తేదీన వెన్నల తండ్రి అబ్రహాం, బాబాయి కలిసి ఆమె ఇంటికి వచ్చారు. అక్కడ కూతురు వెట్టి చాకిరీ చేస్తుందని చూసి అల్లుడు వాసుని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. అక్కడి నుంచి వెళ్లిపోయిన వారు తమ కూతురు పడుతున్న బాధల గురించి గ్రామంలోనే ఉంటున్న తన అక్క తోకల మేరీకి అబ్రహాం, అతని తమ్ముడు చెప్పుకుని బాధపడ్డారు. అనంతరం మేరీ తన భర్త, ఇద్దరు కొడుకులను తీసుకుని వాసు ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగి అంతా కలిసి వాసుపై దాడి చేశారు. వాసుతో పాటు అతడి తమ్ముడు గోపి, మేనమామ తిరుపతిరావులపై కూడా దాడికి దిగారు. ఇదే సమయంలో పాత కక్షలు మనసులో పెట్టుకున్న వెన్నెల బావ అయిన తోకల అరవింద్ తన స్నేహితులు మాతంగి ప్రకాష్, గోళ్ల జయంత్, కంచర్ల ప్రవీణ్, కోట రవికుమార్‌లతో కలిసి అక్కడకు చేరుకుని వాసుపై విచక్షణారహితంగా దాడి చేశారు. కత్తులు, గొడ్డలి, స్క్రూ డ్రైవర్‌తో వాసుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడగా బంధువులు ప్రభుత్వాస్పత్రికి తీసుకు వెళుతుండగానే అతడు మృతి చెందాడు. దీనిపై వాసు మేనమామ తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్‌ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేయగా సీఐ కె.శ్రీనివాసరెడ్డి దర్యాప్తు చేపట్టారు. కేసులో నిందితులుగా ఉన్న మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.

బైక్ ఢీకొని వ్యక్తి దుర్మరణం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): బైక్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సింగ్‌నగర్ నందమూరినగర్‌కు చెందిన వేమూరి సత్యనారాయణ (47) హైవే కాంట్రాక్టు పనులు చేస్తూ ఉంటాడు. ఆదివారం కావడంతో కూర తీసుకుందామని ఇంటి నుంచి తన బైకుపై పైపులరోడ్డు వైపు వెళ్తుండగా బ్రహ్మంగారి మఠం దగ్గరకు వచ్చేసరికి బైక్‌పై వస్తున్న ఇద్దరు మైనర్లు అతి వేగంగా వచ్చి సత్యనారాయణ బైకును ఢీకొట్టారు. దీంతో ఒక్కసారిగా అదుపుతప్పిన రోడ్డుమీద పడడంతో ఆయన తలకు బలమైన గాయమై అక్కడే కుప్పకూలిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు, మృతుడి కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకొని వచ్చి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య ఇహితవేణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రమాదానికి కారణమైన మైనర్ బాలురు, వాహన యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

క్లుప్తంగా

బండారుగూడెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర



హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం బండారుగూడెంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని సర్పంచ్ వడ్లమూడి అమ్మాజీ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 17 రకాల సంక్షేమ పథకాలను అధికారులు తెలిపారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్, పీఎం కిసాన్, పీఎం ఆవాస్ యోజన, ప్రకృతి వ్యవసాయం, గ్రామీణ తపాల జీవిత బీమా పథకాలను ఆయా శాఖల అధికారులు ప్రజలకు వివరించారు. గ్రామ సచివాలయం ప్రాంగణంలో ప్రత్యేక స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన సందేశాన్ని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, ఆయుష్మాన్ భారత్ కార్డులను లబ్ధిదారులకు అందజేశారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రదర్శన ఏర్పాటు చేశారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ పథకాలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వడ్లమూడి తిరుపతిరావు, ఎంపీటీసీ సభ్యురాలు పరిమి మౌనిక, పంచాయతీ కార్యదర్శి ధారవతు తావరియా పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రామ భక్త హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞం పాతబస్తీలో అత్యంత వైభవంగా జరిగింది. జ్ఞానోదయ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ పాతబస్తీలోని ఓం బంక్వాట్ హాల్‌లో 36 గంటల నిర్విరామ హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమాన్ని చేపట్టారు. శనివారం ప్రదోష కాలంలో ప్రారంభమైన ఈ చాలీసా పారాయణ యజ్ఞం సోమవారం ఉదయానికి ముగియనుంది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని చాలీసాను పారాయణం చేస్తూ యజ్ఞ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు శ్రీవల్లి సుబ్బారావు, ప్రియదర్శిని రామ్‌చంద్‌లు మాట్లాడుతూ సమాజం ఆధ్యాత్మికత, సనాతన ధర్మం ఆచరించటం ద్వారా ఆరోగ్యం, ఆనందం, శాంతి కలుగుతాయన్నారు. అయోధ్యలో జరుగుతున్న రామాలయ ప్రతిష్ట విజయవంతంగా జరగాలని రామభక్త హనుమాన్‌ను ప్రార్థిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈశ్వర్‌సాయికుమార్ గుర్రం, సాయి కృష్ణ పేర్ల తదితరులు పాల్గొన్నారు.

చర్చిలకు కేకులు వితరణ

గన్నవరం రూరల్: మండలంలోని సూరంపల్లి గ్రామంలో నూతన సంవత్సరం సందర్భంగా స్థానికంగా ఉన్న 15 చర్చిలకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య ఆదివారం కేకులు అందజేశారు. నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా, ఐశ్వర్యంతో ఉండాలని ఆకాంక్షిస్తూ కేకులు అందజేసినట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, యూత్ విభాగం పాల్గొన్నారు.

కత్తితో దాడి ఘటనపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కత్తితో దాడికి పాల్పడిన వ్యక్తిపై కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భవానీపురం ప్రాంతానికి చెందిన వాసిగిన్ని నాగేంద్ర కుమ్మరిపాలెం సెంటర్‌లో దుస్తుల దుకాణం నడుపుతుంటాడు. శనివారం సాయంత్రం నాగేంద్ర స్నేహితుడైన అనిల్ అయ్యప్ప భజన పెట్టుకున్నాడు. భజనకు నాగేంద్రతో పాటు మరి కొంత మంది స్నేహితులు హాజరయ్యారు. భజన అనంతరం కాలనీలో నివాసం ఉండే చందును ఇంటి వద్ద దింపేందుకు కారులో బయలుదేరారు. కారు తిరిగి వస్తుండగా బ్లాక్ నెం 86 వద్ద నాగూర్ అనే వ్యక్తి తన ఆటోను కారుకు అడ్డుగా నిలిపాడు. కారును ఎందుకు ఆపావని అడగడంతో గోపిని కొట్టడమే కాకుండా అడిగినందుకు నాగేంద్రపై కత్తితో దాడి చేశాడు. దీంతో నాగేంద్ర చెవిపై గాయం కావడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

దుర్గగుడి దేవస్థానానికి కంప్యూటర్ విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానానికి హైదరాబాద్‌కు చెందిన భక్తురాలు రూ.50 వేల విలువ చేసే కంప్యూటర్‌ను ఆదివారం విరాళంగా అందజేశారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌కు చెందిన ఎం.అశిత, ఇందుమతిలు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ ఈవో కెఎస్.రామారావును కలిసిన భక్తులు రూ. 50 వేల విలువ చేసే కంప్యూటర్, ఇతర మెటీరియల్స్‌ను అందించారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అందజేశారు.

కాపు కమ్యూనిటీ భవనానికి ఎంపీ లాడ్స్ నిధులు



కాపు కమ్యూనిటీ భవనానికి రూ.50 లక్షల నిధులు మంజూరు పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ వల్లభనేని బాలశౌరి

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లో నిర్మిస్తున్న కాపు కమ్యూనిటీ భవనానికి మచిలీపట్నం లోక్‌సభ సభ్యుడు వల్లభనేని బాలశౌరి రూ. 50 లక్షలు ఎంపీ లాడ్స్ నిధులు కేటాయించారు. విజయవాడలోని ఎంపీ బాలశౌరి నివాసంలో ఆదివారం ఏపీ నాటక అకాడమీ చైర్మన్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ ఆధ్వర్యంలో పలువురు కాపు నాయకులు ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా కాపు కమ్యూనిటీ భవనానికి రూ. 50 లక్షల ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు పత్రాన్ని ఆయన అందించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ. 25 లక్షలు మంజూరు చేయగా, దీనికి అదనంగా ఎంపీ బాలశౌరి మరో రూ.50 లక్షలు కేటాయించారు. అంతేకాక కమ్యూనిటీ హాల్‌కు కావాల్సిన గ్రానైట్ రాళ్లను సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని ఎంపీ ప్రకటించినట్లు నక్కా గాంధీ పేర్కొన్నారు. ఎంపీ బాలశౌరికి కాపు నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీ బాలశౌరి సూచనల మేరకు కమ్యూనిటీ హాల్‌కు స్వర్గీయ వంగవీటి మోహనరంగా పేరును పెట్టాలని ప్రతిపాదిస్తున్నట్లు చెప్పారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు యర్రంశెట్టి రామాంజనేయులు, కాపు నాయకులు నూకల బాలాజీ, నరహరిశెట్టి బాబురావు, చోడే లక్ష్మణరావు, పల్నాటి రాంబాబు, గంధం రామారావు, కమ్మిలి శ్రీధర్, సముద్రాల రాజాబాబు, వడ్డి గిరి, సురేష్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ క్లస్టర్ కమిటీల నియామకం

చిలకలపూడి(మచిలీపట్నం): గన్నవరం నియోజకవర్గ క్లస్టర్ కమిటీలను నియమించినట్లు ఆదివారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

- గన్నవరం మండల క్లస్టర్ కమిటీకి అధ్యక్షుడిగా నీలం ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా సామాల అంజనేయులు, ఓబులనేని బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శులుగా ఎస్‌కే రఫీ, జంపాన బుజ్జి, బండి వెంకటేశ్వరరావు, కోశాధికారిగా భూక్యా కోటేశ్వరరావుతో పాటు ఆరుగురు కార్యదర్శులు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.
- బాపులపాడు మండల క్లస్టర్ కమిటీకి అధ్యక్షుడిగా నక్కా గాంధీ, ఉపాధ్యక్షులుగా కంద్రు జయరాజు, గుడిసె నిర్మలరాజు, ప్రధాన కార్యదర్శులుగా తూము హరిబాబు, గంధి వెంకటచిన్నారావు, వేముల శ్రీను, కోశాధికారిగా షేక్ గాలిబ్‌తో పాటు ఆరుగురు కార్యదర్శులు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.
- ఉంగుటూరు మండల క్లస్టర్ కమిటీకి అధ్యక్షుడిగా వింత శంకర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా గుడిసే బాలస్వామి, వీరంకి శివరామకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా విశ్వనాథపల్లి రవి, జుజ్జుల కిషోర్, కుర్రా సుబ్బారెడ్డి, కోశాధికారిగా తియ్యగుర రాజేంద్రరెడ్డితో పాటు ఆరుగురు కార్యదర్శులు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.
- విజయవాడరూరల్ కమిటీకి అధ్యక్షుడిగా దేవగిరి ఓంకార్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా శిర్రా సంజీవ, బత్తిన ఏసు, ప్రధాన కార్యదర్శులు అంగజాల హనుమ, బత్తుల కోటేశ్వరరావు, చేబోయిన కిషోర్‌రావు, కోశాధికారిగా వాల రాముతో పాటు ఆరుగురు కార్యదర్శులు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులను నియమించారు.

సైన్స్ ఎక్స్‌పోలో వెల్లివిరిసిన విద్యార్థుల సృజనాత్మకత



సైన్స్ ఎక్స్‌పో తిలకిస్తున్న డాక్టర్ రవీంద్రనాథ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలోని రవీంద్రభారతి విద్యా సంస్థకు చెందిన నెక్స్ట్ జెన్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన సైన్స్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించిన పలు ప్రాజెక్ట్స్‌లో విద్యార్థుల సృజనాత్మకత వెల్లివిరిసింది. ఇందులో చంద్రయాన్, వాటర్ డ్యామ్, ఎలక్ట్రికల్ పవర్ సప్లై, నైబర్‌హుడ్, దేవతా రూపాలు, సౌర కుటుంబం, జానపద కళారూపాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రాహాస్పిటల్ డాక్టర్ ఎం రవీంద్రనాథ్ సైన్స్ ఎక్స్‌పోను తిలకించి నమూనాలను ప్రదర్శించిన విద్యార్థులతో ముచ్చటించారు. విజయవాడ రవీంద్రభారతి విద్యా సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ వివిధ నమూనాలను తయారు చేసిన విద్యార్థులు, వారికి అండగా నిలిచిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ప్రశంసించారు. స్కూల్ డైరెక్టర్ వీరమాచనేని శాంతి, పాఠశాల వివిధ బ్రాంచిల జనరల్ మేనేజర్ రాజేష్, జోనల్ ఇన్‌చార్జి సరళాదేవి, క్యాంపస్ ప్రిన్సిపాల్ కె.సరిత, వైస్ ప్రిన్సిపాల్స్ ఎం.సరిత, పీ మోనిక, క్యాంపస్ ఇన్‌చార్జి తరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతల పంపిణీ



కాచవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో అక్షింతలకు పూజలు



గంపలగూడెంలో అక్షింతలకు ప్రత్యేక పూజ

కాచవరం(ఇబ్రహీంపట్నం): కాచవరం రామలింగేశ్వరస్వామి ఆలయంలో అయోధ్య రాముని దివ్య అక్షింతలకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సుబ్రహ్మణేశ్వరశర్మ భక్తులచేత విఘ్నేశ్వర పూజ చేయించారు. గ్రామ వికాస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రముఖులు తిరుపతయ్య అధ్యక్షతన పూజా కార్యక్రమాలు జరిగాయి. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొని అయోధ్య శ్రీరామచంద్రమూర్తి అక్షింతలు ప్రసాదంగా స్వీకరించారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: అయోధ్య రామయ్యను తాకిన అక్షింతల కలశాలకు ఆదివారం గంపలగూడెం సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అక్షింతలను వృద్ధి చేశారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం నుంచి భక్తులకు పంపిణీ చేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ విశ్వనాథ్, రామసేవకులు క్రాంతి, రవి, పుల్లారావు, నాగేశ్వరరావు, బుజ్జి పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ

జి.కొండూరు: ఇటీవల జి.కొండూరు కోదండ రామాలయానికి చేరిన అయోధ్య రామయ్య అక్షింతలకు ఆలయ నిర్వాహకులు ఆదివారం ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం సమీప గ్రామాలైన ఆత్కూరు, గడ్డమణుగు, చెర్వుమాధవరం, మునగపాడు, సున్నంపాడు, తెల్లదేవరపాడు, గంగినేని, దుగ్గిరాలపాడు, పినపాక గ్రామాలకు అక్షింతలను పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకుడు నాగరాజు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు చర్చిలు ముస్తాబు



మధురానగర్(విజయవాడసెంట్రల్): నూతన సంవత్సర వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. మధురానగర్, ముత్యాలంపాడు, అంబేడ్కర్ కాలనీ, రామకృష్ణాపురం, దేవీనగర్, గులాబీతోట, మాచవరం, బసవతారకనగర్, శాంతినగర్, పసుపుతోట తదితర ప్రాంతాల్లో ఆదివారం నుంచే నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రార్థనలు నిర్వహించారు. ఆదివారం అర్ధరాత్రి దాటిన తరువాత కేక్‌లు కట్‌చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేసి మిఠాయిలు పంపిణీ చేయనున్నట్లు సీయోను ప్రార్థన మందిరం పాస్టర్ రెవరెండ్ డాక్టర్ కనమాల వరప్రసాద్ తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ



చెక్కు అందజేస్తున్న విప్ ఉదయభాను

జగ్గయ్యపేట అర్బన్: అనారోగ్యంతో బాధపడు తూ కష్టాల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ వరం లాంటిదని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను అన్నారు. ఇటీవల మోకాలి ఆపరేషన్ చేయించుకున్న పోచంపల్లి గ్రామానికి చెందిన చెరుకూరి సూర్యలక్ష్మికి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.70వేల చెక్కును ఆదివారం తన నివాసంలో ఎమ్మెల్యే ఉదయభాను లబ్ధిదారురాలికి అందజేశారు. పేదలపై వైద్యఖర్చుల భారం ఉండకూడదనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్‌మోహనర్ రెడ్డి ప్రభుత్వం సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని వివరించారు. లబ్ధిదారు కుటుంబం ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేసింది.

అన్యోన్య జీవనంతో కుటుంబ వ్యవస్థ పటిష్టం

అల్లూరు(వీరులపాడు): భార్యాభర్తలు ఎటువంటి మనస్పర్థలకు తావులేకుండా అన్యోన్యంగా జీవనం సాగించినప్పుడే కుటుంబవ్యవస్థ మరింత పటిష్టమవుతుందని ఏసీపీ జనార్దన్ నాయుడు పేర్కొన్నారు. సమాజంలో జరుగుతున్న నేరాలు, అఘాయిత్యాలపై మండలంలోని అల్లూరులో మహిళలు, విద్యార్థులకు ఆదివారం రాత్రి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ జనార్దన్‌నాయకుడు మాట్లాడుతూ నేటి యువత చెడు వ్యసనాలకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోకుండా చదువుపై దృష్టిసారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు చెప్పే మాటల కంటే చెడునడవడిక కలిగినవారి మాటల ప్రభావం యువతపై ఉంటోందన్నారు. అటువంటి ధోరణిని విడనాడాలని యువతీయువకులకు సూచించారు. ప్రతిఒక్కరు సమాజానికి, దేశానికి ఉపయోగపడేలా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ మహాలక్ష్మణుడు, సర్పంచ్ బందెల రాణి, వైస్ ఎంపీపీ వేమూరి ఆదాం, ఎంపీటీసీ సభ్యురాలు మోండ్రు బాయమ్మ, ఉపసర్పంచ్ బెల్లంకొండ నాగేశ్వరరావు, నాయకులు కుంపటి శ్రీను, రాజగోపాల్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఒత్తిళ్లే సమస్యలకు కారణం

ఆటోనగర్(విజయవాడతూర్పు): మనసును నశింపచేయడమే అహంకారాన్ని వదలటమే యోగం.. ఆహాన్ని భగ్నం చేసేది జ్ఞానాగ్ని.. నవ్వుతూ జీవితాన్ని గడపడమే యోగం అని ఎం రఘుగురూజీ అన్నారు. వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో సమ భావనా మిత్రమండలి ఆధ్వర్యంలో ఆదివారం కోనేరు నరేంద్రబాబు అధ్యక్షతన ఆరోగ్యానికి వ్యక్తిత్వ వికాసానికి యోగా అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా రఘు గురూజీ మాట్లాడుతూ.. మితాహారం అవసరమని.. 35 ఏళ్ల పాటు శరీరాన్ని కాపాడితే తర్వాత శరీరం మనల్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో టి.శోభనాద్రి, యార్లగడ్డ రంగారావు, సీహెచ్ వెంకటరెడ్డి, గుమ్మా సాంబశివరావు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించాలి

తిరువూరు: మహిళా సాధికారతకు, విద్యాభివృద్ధికి విశేషకృషి చేసిన సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్ గంగాధర్ కోరారు. తిరువూరు సుందరయ్య భవనంలో ఆదివారం ఉదయం జనవిజ్ఞాన వేదిక సమావేశం నిర్వహించారు. జనవరి 3న సావిత్రీబాయి పూలే జయంతిని అన్ని విద్యాసంస్థలు, కార్యాలయాల్లో నిర్వహించే విధంగా ప్రభుత్వం ఆదేశాలివ్వాలని కోరారు. జనవరి 7న జరిగే జిల్లా స్థాయి చెకుముకి సామర్థ్య పరీక్షలో అర్హులైన విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.

కార్మికులకు బియ్యం పంపిణీ

ఆటోనగర్(విజయవాడతూర్పు): నూతన సంవత్సరం సందర్భంగా లిడ్క్యాప్ చెప్పుల షోరూంలో పని చేసే కార్మికులకు లిడ్క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ బియ్యం బస్తాలను ఉచితంగా పంపిణీ చేశారు. 10 మంది కార్మికులకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం బస్తాలను ఆయన అందజేశారు. రాజశేఖర్ మాట్లాడుతూ పేదలకు సహాయం చేయడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. లిడ్‌క్యాప్ చైర్మన్ సతీమణి షర్మిలా, వైఎస్ ట్రేడర్స్ అధినేత డి.ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు 120 అడుగుల మహాస్తూపం ఆవిష్కరణ



మైలవరం: మైలవరం గుర్రాజుపాలెం క్రాస్ రోడ్డు వద్ద నూతనంగా నిర్మించిన 120 అడుగుల ఎత్తుగల సాయికోటి మహాస్తూపం సోమవారం ఆవిష్కరించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మహా స్తూపం ఏర్పాటు చేసిన షిరిడీ సాయిబాబా సేవాశ్రమం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాస్తూపం, ఆలయంలోని స్వామి వారి విగ్రహం వద్ద మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధాన రహదారుల్లో భక్తులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ సాయిబాబా బోధనలో ప్రేమ, కరుణ, దానం, సంతృప్తి, శాంతి, దైవారాధన, గురుపూజ ముఖ్యమన్నారు.

బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలి

షిరిడీ సాయిబాబా మందిరం క్యాలెండర్ ఆవిష్కరించిన గౌతంరెడ్డి



బాబా మందిరంలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆంధ్రా షిరిడీగా విరాజిల్లుతున్న ముత్యాలంపాడు షిరిడీ సాయిబాబా మందిరం ఆధ్వర్యాన నూతన సంవత్సరంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని కోరుతూ భక్తులకు పదివేల క్యాలెండర్‌లు పంపిణీ చేయనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. మందిర కమిటీ ఆధ్వర్యాన ఆదివారం నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మందిర సభ్యులతో కలిసి నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో మహిమాన్వితమైన ముత్యాలంపాడు షిరిడీ సాయి బాబావారి ఫొటోతో ముద్రించిన క్యాలెండర్‌ను ఇంట్లో ఉంచుకోవటం భక్తులకు ఆనవాయితీగా మారిందన్నారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఏటా క్యాలెండర్‌లను ముద్రించి భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఈ సంవత్సరం 10 వేల క్యాలెండర్‌లను ఆదివారం అర్ధరాత్రి నుంచి పంపిణీ చేయనున్నామన్నారు. మందిర అధ్యక్షుడు పొన్నలూరి లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కుంచనపల్లి రవిశంకర్, కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా నూతన సంవత్సరం కేక్‌ల అమ్మకాలు



నున్నలో కేక్, స్వీటు షాపులు



కంకిపాడులో మిఠాయిల విక్రయాలు

నున్న(విజయవాడరూరల్): నూతన సంవత్సరం -2024ను పురస్కరించుకుని కేక్‌ల విక్రయాలు జోరుగా జరిగాయి. రోడ్డు వెంట బాక్కుల్లో పెట్టి కేక్‌లు విక్రయిస్తున్నారు. ప్రజలు నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ఆనందోత్సాహాలతో కేక్‌లు, స్వీట్లు, పండ్లు కొనుగోలు చేశారు. నున్న, బోడపాడు, పాతపాడు, విలేజి కండ్రిక, అంబాపురం, పి.నైనవరం గ్రామాల్లో కేక్‌ల అమ్మకాలు జరిగాయి.

కంకిపాడులో..

కంకిపాడు: కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. న్యూ ఇయర్ వేడుకలకు పట్టణంలోని దుకాణాల్లో స్వీట్లు, కేక్‌లు, రకరకాల రంగుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కొనుగోలుదారులతో ఆయా దుకాణాలు కళకళలాడుతున్నాయి.

గ్రంథాలయంలో అందుబాటులోకి కంప్యూటర్లు



ఇంటర్‌నేట్ సేవలను ప్రారంభిస్తున్న రోటేరియన్లు

గన్నవరం: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో దాతలు అందజేసిన కంప్యూటర్లను ఆదివారం వినియోగంలోకి తీసుకువచ్చారు. రోటేరియన్ జాస్తి వెంకటకృష్ణారావు ఇటీవల గ్రంథాలయానికి రెండు కంప్యూటర్లను బహూకరించారు. విద్యార్థులు, పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వినియోగించుకునే విధంగా ఈ కంప్యూటర్లను అందుబాటులో ఉంచారు. వీటికి రోటరీక్లబ్ మాజీ అధ్యక్షుడు చిమట రామారావు సౌజన్యంతో ఇంటర్‌నేట్ సదుపాయం కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నర్రా సీతారామారావు మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. గ్రంథాలయంలోని పుస్తక సంపదతో పాటు సదుపాయలను పాఠకులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు జాస్తి విజయ భూషణ్‌కుమార్, విశ్రాంత అధ్యాపకుడు గన్నె వెంకట్రావు, టీఎస్‌ఆర్కే ప్రసాద్, గ్రంథాలయ ఇన్‌చార్జ్ డి.బాబురావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో పెద్ద సంఖ్యలో ఉభయదాతలు పాల్గొన్నారు. తెల్లవారుజాము నుంచి ప్రారంభమైన భక్తుల రద్దీ మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగింది. తెల్లవారుజామున అమ్మవారి ప్రధాన ఆలయంలో నిర్వహించిన ఖడ్గమాలార్చన, ఉత్సవ మూర్తి వద్ద నిర్వహించిన లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీహోమంలో ఉభయదాతలు పాల్గొన్నారు. లోక సంరక్షణార్థం సర్వ మానవాళి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆయా ఆర్జిత సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో ఆలయ ఈవో రామారావు క్యూలైన్లను పర్యవేక్షించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆలయ అధికారులను ఆదేశించారు. సాయంత్రం పంచహారతుల సేవ, పల్లకీ సేవలోనూ భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

నూతన బోరు, మోటారు ఏర్పాటు



వలసపల్లిలో బోరు వేయిస్తున్న సర్పంచ్, ఉపసర్పంచ్

ముసునూరు: గ్రామ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రూ.70.4 లక్షలతో నూతన బోరు, మోటారు, పైపు లైన్లు వేయించి, తాగునీటి సరఫరా కల్పిస్తున్నట్లు వలసపల్లి సర్పంచ్, ఉప సర్పంచ్ చలసాని దామోదర్, దారగాని సుబ్బారావు తెలిపారు. రూ.45.4 లక్షల జలజీవన్ మిషన్ నిధులతో ఎస్సీ ఏరియాలోని ప్రజల సౌకర్యార్థం నల్లచెరువు వద్ద ఆదివారం బోరు వేయించారు. దీనికి నూతన మోటారు బిగించి, గ్రామం అంతటా పైప్‌లైన్లు వేయించనున్నట్లు తెలిపారు. దీనికి అనుసంధానంగా రూ.25 లక్షలతో 40,000 లీటర్ల నీటి సామర్థ్యం గల వాటర్ ట్యాంకు నిర్మాణం ఇప్పటికే చేపట్టామన్నారు.

కార్మిక హక్కుల పరిరక్షణకు కృషి

విస్సన్నపేట: ప్రజలందరికీ స్వేచ్ఛా సమానత్వంతో పాటు కార్మికవర్గ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చలసాని వెంకట రామారావు అన్నారు. స్థానిక ఏఎంసీ మార్కెటింగ్ గోడౌన్ వద్ద తిరువూరు నియోజకవర్గ ఏఐటీయూసీ మహాసభ ఎం త్యాగరాజు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు చాట్ల పుల్లారావు, రైతుసంఘం జిల్లా నాయకుడు తూము కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పనుల పరిశీలన

పెనుగంచిప్రోలు: అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేయాలని ఆలయ ఈవో కె రమేష్‌నాయుడు సూచించారు. గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయం, మునేరు అవతల అమ్మవారి మామిడి తోటల్లో సుమారుగా రూ.15కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. పనుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడితే సహించది లేదని అధికారులు, కాంట్రాక్టర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలయ ఈఈ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



నందిగామ: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ హనీష్ హెచ్చరించారు. పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హనీష్ మాట్లాడుతూ రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి రౌడీషీటర్‌పై ప్రత్యేక నిఘా ఉందన్నారు. నూతన సంవత్సర వేడుకల పేరుతో ఎక్కడన్నా అల్లర్లు సృష్టించాలని చూస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సైలు దుర్గామహేశ్వరరావు, పండు దొర , సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.30వేల విరాళం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామానికి చెందిన కొలికినేని దేశయ్య, సీతారత్నం దంపతులు రూ.30 వేలు విరాళంగా ఆలయ అధికారులకు అందజేశారు. మందడపు శ్రీకాంత్, త్రివేణి దంపతులు ఆలయ గోశాలలో గోవుల సంరక్షణకు రూ.10వేలు అందజేశారు.